33

# త్యాగముచేతనే అమృతత్వమనే దైవత్వము ప్రాప్తిస్తుంది

**తనదు తప్పు తాను తలచంగ సుజ్ఞాని**
**పరుల తప్పులెల్ల వెదకువాడు**
**తనను తెలియ లేడు తన తప్పు తెలియడు**
**ఇతనికంటె మూర్ఖుడవనిమేలు**

పుష్టిని, అందమును బట్టి గొడ్డుకు విలువనిస్తారు. కాని, మనిషికి బుద్ధిని బట్టి విలువ ఉంటుంది. బుద్ధి పెరుగుకొలది మానవత్వము అభివృద్ధి గాంచుతుంది. బుద్ధి తరుగుకొలది పశుత్వము అభివృద్ధి అవుతుంది. వెదురు కఱ్ఱకు ఎత్తును, లావును చూసి విలువనిస్తారు. కానీ, చెఱకునకు రసమునుబట్టి విలువనిస్తారు. ఈనాటి మానవుడు బుద్ధియొక్క తత్త్వాన్ని, ప్రవర్తనను గుర్తించుకోలేకపోవటంచేతనే మానవుని విలువ దిగజారిపోతున్నది. ఆకారము మానవాకారము, బుద్ధి పశుబుద్ధి. దీనినే 'ద్విపాద పశువు' అంటారు. అందువలన, ఆకారము మానవాకారముగా ఉన్నప్పుడు, బుద్ధికూడను మానవ బుద్ధియే అభివృద్ధిపరచుకోవాలి.

**కామక్రోధలోభములు మూడింటిని త్యాగము చేయాలి**

ఇది త్యాగముచేతను, యోగముచేతను మనకు ప్రాప్తిస్తుంది. త్యాగము మానవుని జీవితములో ఒక ప్రధానమైన పాత్ర. ఏనాటికైనా వస్తువు తననైనను, తాను వస్తువునైనను త్యాగము చేయక తప్పదు. తాను అట్టి త్యాగమనస్కుడు కానప్పుడు, ప్రపంచమే బలవంతముగా అతనిచేత త్యాగము చేయిస్తుంది. ఇది తప్పనది కాదు. అయితే, దేనిని త్యాగము చేయాలి? బాహ్యమైన వస్తువులనా లేక ఆలుబిడ్డలనా లేక ఆస్తిపాస్తులనా త్యాగము? కాదు, కాదు. ఇవి త్యాగము చేయటం అతి సులభము. మానవుడు పట్టుపట్టి ప్రయత్నించిన యివి సులభముగా త్యాగము చేయగలడు. కానీ, యీ త్యాగము త్యాగము కాదు.

srisathyasaivahini.org (watermark: sri sathya sai vachanamrutam)

మనం చేయవలసిన త్యాగము యేమిటి? అంతర్ముఖమైన కామక్రోధ లోభములు యీ మూడింటిని త్యాగము చేయాలి. 'కామం కర్మనాశనం, క్రోధం జ్ఞాననాశనమ్, లోభం భక్తినాశనం'. ఈ desire కోరిక అనేది కర్మలను నిర్మూలంగావిస్తుంది. ఏ కర్మ చేయతగినది, ఏకర్మ చేయతగనిది అనే విచక్షణా జ్ఞానం కోల్పోతుంది. కర్మ తన యథార్థ స్వరూపాన్ని కోల్పోతుంది. కనుకనే ఉపనిషత్తులు మొట్టమొదట 'కర్మకు నమస్కరించు', అని చెప్పాయి. 'తస్మై నమః కర్మణే' ఏపని మొదలుపెట్టినా ఆపనికి మొట్టమొదట నమస్కరించి తరువాత ఆ పనిలో ప్రవేశించమన్నారు. ఎందుకోసం? ఈ కర్మ పవిత్రమైనదిగను, పరులకు ఉపకారమైనదిగను, పరులకు హాని కలిగించనిదిగను, తన యీ ప్రాప్తికి సహాయకారిగను ఉండాలని కర్మకు నమస్కరించాలి. కాని, యీనాటి మానవుడు 'సమాజమునుండి తనకు యేమిఫలితము లభించును', అనే ఉద్దేశ్యముతోనే కర్మలో ప్రవేశిస్తున్నాడు. మానవుడు కోరవలసినది అది కాదు. నానుంచి యీ సమాజమునకు ఏమి ఉపకారము, ఏమి సహాయము, ఏమి మంచి జరుగుతుంది అనే ఉత్తమభావంతో చిత్తమును సరిదిద్దుకోవాలి. కోరిక, యీ ఉత్తమ భావమునకు తగిన ఉత్తేజము యివ్వలేకుండా పోతుంది. కనుకనే మనం చేయవలసిన కర్మలలోపల అనేక విధములైన దోషములు యిమిడి ఉంటున్నాయి. దీనిని పురస్కరించుకొనియే 'కామం కర్మనాశనమ్' అన్నారు.

క్రోధము. ఈ క్రోధము మానవుని ఒక పిచ్చివానిగా రూపొందింపచేస్తుంది. క్రోధము బలవత్తరమైన శక్తి కలిగినది. కనుక మొట్టమొదట దీనిని త్యాగము చేయాలి మనము.

మూడవది, లోభము. ఎంత సంపాదించినా, ఎంత శక్తి కల్గి ఉండినా త్యాగమనేది లోభమునకేమాత్రం గిట్టదు. పరులనుండి పుచ్చుకొనుటకు మాత్రమే సిద్ధముగా ఉంటుంది కాని, లోభము పరులకిచ్చుకొనుటకు యేమాత్రం సమీపమునకు రాదు. 'నాయింటికి వస్తే యేమి తెస్తావు, నీయింటికి వస్తే యేమి యిస్తావు', అంటుంది యీ లోభము. నేను 'మీయింటికి వచ్చినా నాకు ఆదాయమే, నీవు మాయింటికి వచ్చినా నాకు ఆదాయమే కావాలి'. ఈ విధమైన పేరాశతో, దురాశతో కూడినది, ఈ లోభము. ఇలాంటి దుర్గుణముల నభివృద్ధిపరచే లోభమును మనము త్యాగము చేయాలి. దీనినే వైరాగ్యమన్నారు. వైరాగ్యమనగా ఏమిటి? రాగమునకు

sri sathyasai vacharamrutam

విరుద్ధమైనదే వైరాగ్యము. ఈ దేహభ్రాంతి తప్పుకాదు. బంధుభ్రాంతికూడను దోషము కాదు. కుటుంబ భ్రాంతికూడను దోషముకాదు. తల్లి తండ్రులను ప్రేమించవలసినదే, సోదర సోదరీమణులను ఆశించవలసినదే, నీయొక్క దేహమునకు ఆరోగ్యము చేకూరాలని నీవు కోరవలసినదే, అయితే, ఈ రాగమునకు కొంతవరకు హద్దు ఉండాలి. పరిమితి ఉండాలి. సంగీతములో పలుమార్లు వింటుంటాము. రాగం పాటకు అవసరమే! కాని, మితిమీరిన రాగముతీస్తే వినేవానికి రోగం వస్తుంది. 'కొండంతరాగం తీసి గోరంత పదము చెప్పాడుట! కనుక, పాటకు తగినంత రాగము ఉంటుండాలి. వంటకు తగినంత మంట ఉండాలి. పప్పుకు తగిన ఉప్పు ఉండాలి. పప్పు ఎంత ఉందో ఉప్పు అంతవేస్తే తినటానికి వీలుకాదు. అదే విధముగనే మన రాగము కూడను ఎంతవరకో అంత ఉండాలి. ఈనాడు యీరాగము మితిమీరి పోతోంది. తన దేహభ్రాంతిగాని, తన బంధుభ్రాంతిగాని, తన కుటుంబభ్రాంతి గాని, తన విద్యాభ్రాంతిగాని, తన జ్ఞానభ్రాంతిగాని యీ భ్రాంతులనేవన్నీ ఒక హద్దును దాటి, ఒక పరిమితము దాటి ప్రయాణము చేస్తున్నాయి. కనుకనే రాగమును అదుపులో ఉంచుకోవాలి. మానవత్వంలో మనము కోరవలసినదానికికూడా కొంత limits లో ఉండాలి. 'నశ్రేయోనియమం వినా'! ఇది దురాశగా మారిపోతుంది. ఈ దురాశ, దుఃఖమునకు హేతువు అవుతుంది. కనుక మనము రాగమును కొంతవరకు పరిమితమునకు తెచ్చుకున్నప్పుడే అది వైరాగ్యమనే దానిగా మారిపోతుంది.

**పరతత్త్వములో ఉన్న ఆత్మ, దేహమనే జడములో ఉన్న ఆత్మ ఒకటే అనే ఏకత్వమును గుర్తించటమే వైరాగ్యము**

వైరాగ్యమనగా ఏమిటి? వైరాగ్యమనగా వస్తువుయొక్క సంబంధమును మరచి వస్తువునందున్న అంతర్‌శక్తిని లక్ష్యము నందుంచుకోటమే! పదిమంది దుర్మార్గులలోపల ఒక్కడైనా సన్మార్గుడు ఉంటాడు. పదిమంది సన్మార్గులలోపల ఒక్కడైనా దైవభ్రాంతి కల్గినవాడుంటాడు. పదిమంది దైవభ్రాంతి ఉన్నవారిలో ఒక్కడైనా దైవప్రీతి కల్గిఉంటాడు. పదిమంది భగవత్ప్రీతి కలిగినవారిలో ఒక్కడైనా భగవంతుని ప్రేమను అనుభవించాలని ఆశించేవాడుంటాడు. భగవంతుని ప్రేమను అనుభవించాలి అనుకునే పదిమందిలోపల ఒక్కడైనా

సర్వసంగ పరిత్యాగి ఉంటాడు. సర్వసంగ పరిత్యాగము చేసినప్పుడే భగవత్ ప్రేమకు అర్హుడౌతాడు. కనుకనే 'త్యాగేనైకే అమృతత్వ మానసుః' అన్నారు. ఈ త్యాగముచేతనే అమృతత్వమనే దైవత్వము మనకు ప్రాప్తిస్తుంది. అయితే, దీనిని యేరీతిగా మనము వైరాగ్యం చేయాలి?

ప్రపంచము వస్తుసమూహము. ఇది కేవలము ఒక జడస్వరూపము. జగత్తును మనయింద్రియములంతా అనుభవిస్తున్నాయి. ఇంద్రియములన్నీ జడమైనవే! చూచే నేత్రము జడమే! వినే చెవులు జడమే! పలికే నాలుక జడమే! గంధమును ఆస్వాదించే ముక్కుకూడా జడమే! కడపటికి దేహమంతా జడమే! ఇందులో చైతన్యమనేది మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము యీ నాల్గింటియొక్క సమ్మిళితమైన స్వరూపము. ఆచైతన్యమును అందించటముచేతనే యీ జడమంతా పనిచేయగలుగుతోంది. స్థూలమైన జగత్తునంతా ఒక జడముగా మనము భావించాలి. ఇంక సూక్ష్మమైన మనో, బుద్ధి, చిత్త, అహంకారములు యివి మాయా స్వరూపములు. 'మాయ' అనగా ఏది లేదో అదే మనకు ఉండినట్టుగా కనుపించటము. మానవుని బుద్ధి కేవలం ఒక మానవాకారాన్నే ధరింపచేస్తుంది. యివన్నీ మాయగా కనుపిస్తుంది. ఉన్నది లేనట్టుగా లేనిదానిని ఉన్నట్టుగా భ్రమింపచేస్తుంది. ఈ మాయకు మరొకపేరు అజ్ఞానము. అజ్ఞానమనగా ఏమిటి? కేవలం సత్యము కాని దానిని సత్యముగా భ్రమింపచేయటము, అసత్యమును సత్యముగా నిరూపింపచేయటము. నేను దేహమును ధరించాను, నాకంటె ముందు అనేకమంది మరణిస్తున్నారు. అనేకమంది రోగములతో పీడింపబడుతున్నారు. ఇవన్నీ కంటితో చూస్తున్నాము, చెవులతో వింటున్నాము. కాని, మనము శాశ్వతముగా ఉంటామని భ్రమిస్తున్నాము. ఇదే అజ్ఞానము. అందరూ పోతున్నప్పుడు మనము మాత్రము పోమా? అందరి దేహములు అశాశ్వతమైనప్పుడు మనదేహము మటుకు శాశ్వతమెలా అవుతుంది? ఈ మాయను ప్రవేశింపచేయటంచేతనే అనిత్యము నిత్యముగా, నిత్యము అనిత్యముగా భ్రమింపచేస్తుంది. కనుక యీ సూక్ష్మరూపమైనదంతా మాయనే! స్వప్నము సూక్ష్మరూపము. స్వప్నములో ఎన్నో అనుభవిస్తున్నాము. స్వప్నకాలమునకు మాత్రమే అవి సత్యముగా నిరూపిస్తున్నాయి. జాగ్రత వచ్చేటప్పటికి వాటన్నింటిని మనము మరచిపోతున్నాము. అలక్ష్యం చేస్తున్నాము. అప్పుడు సత్యము అనుకున్నది జాగ్రతలో అసత్యముగా ఉంటుంది. స్వప్నములో

sri sathyasai vahini amrutam

భయపడిన వ్యక్తి జాగ్రతలో ధైర్యముగా అనుభవిస్తున్నాడు. ఇదియే మాయయొక్క స్వభావము. ఇదే మాయయొక్క రహస్యము. కనుకనే ప్రత్యక్షము, భౌతికము, జాగ్రత యివి జడము. స్వప్నము, సూక్ష్మము యివి అంతా మాయ. ఇంక కారణము. ఈ కారణమనేది ప్రతిబింబము. ఈ ప్రతిబింబమునకు యేవిధమైన చైతన్యములేదు. ప్రతిబింబమునకు రూపము లేదు. నామము లేదు. దానికి సుఖములేదు. దుఃఖములేదు. ఇలాంటి దానిని కట్టుకొని మనము యేమి అనుభవించటము? జాగ్రత చూస్తామా జడము, సూక్ష్మము చూస్తామా మాయ. కారణము చూస్తామా ప్రతిబింబము. ఈ మూడింటితో నాకు సంబంధములేదు. దీనికి అతీతమైనది మహాకారణము. అదే పరతత్త్వము. ఆ పరతత్త్వములో ఉన్న ఆత్మ, యీ జడములో ఉండిన ఆత్మ రెండునూ ఒక్కటే. ఇట్టి ఏకత్వమును గుర్తించటమే వైరాగ్యము అన్నారు.

**రాగరహితము గావించుకోవటమే వైరాగ్యము**

కనుక, ఆస్తిని, ఆలు బిడ్డలను వదలిపెట్టి పోవటముకాదు, వైరాగ్యము. ఉన్నదానిలో ఉన్న సత్యమును గుర్తించటమే వైరాగ్యము. రాగరహితము గావించుకోటమే వైరాగ్యము. ఎంతనో మనము సాధించాము. ఎంతనో మనం అనుభవించాము. ఇవన్నీ యెక్కడకు పోయినాయి? ఎక్కడ ఉన్నాయి? ఎందుకు మనము వదలుతున్నాము? దానివలన మనకొచ్చిన ఫలితమేమిటి? ఈ విధమైన విచారణ సల్పినప్పుడు యీవస్తువులు కాని, విషయములుగాని, వ్యక్తులుగాని కేవలం ఒక తెర బొమ్మలవంటివేనని గుర్తించుకోటానికి వీలవుతుంది. మధ్యలో వచ్చిపోయేవి కదలిపోయే మేఘముల వంటివే! ఈ మానసిక తత్త్వమనే దానిని చక్కగా గుర్తించటానికి మీరు ప్రయత్నించారు. ఒక చెంబులో నీరు పోసుకుని సముద్రములో కలిపినప్పుడు యింక తిరిగి ఆ నీరు మనం తీసుకోటానికి సాధ్యము కాదు. పొగ ఆకాశములో చేరిన తర్వాత తిరిగి దానిని వెనుకకు తీసుకోలేము. తినిన ఏపిల్ పండును మనము జీర్ణించుకున్నాక ఆ పండు మనకు లభించదు. కాని మనస్తత్త్వాన్ని మాత్రం తినటానికి సాధ్యము కాదు. కలపటానికి వీలుకాదు. చేరటానికి అవకాశం లేదు. మనసును ఒకరు అనుభవించటానికి సాధ్యము కాదు. దానిని అరికట్టుకోటానికి శక్తిలేదు. సమస్త మానవులు, సమస్త జీవులు మనస్సుకు స్వాధీనము కావలసినదేగాని మనసును అరికట్టుకోటం ఎవరికీ సాధ్యము కాదు. అయితే మనో నిగ్రహమని

srisathyasaivahini.org

ఎందుకు పెట్టారు? అది నిగ్రహించటంకాదు. **అలక్ష్యము చేయటమే నిగ్రహించటము.** దానిని కంట్రోలు చేయటం సాధ్యముకాదు. గాలిని ఎవరు చేతిలో పట్టుకోగలరు? అదే విధముగనే అనంత స్వరూపమైన యీ మనస్తత్త్వమును ఎవరు నిగ్రహించుకోగలరు? 'సంకల్పవికల్పములతో కూడినది మనస్సు', అనే సత్యాన్ని తెలుసుకొన్నప్పుడు సంకల్పములు లేకుండా చేసుకోటమే ఆయొక్క మనసును నిగ్రహించుకోటం. ఈ సంకల్పములు రాగముతో కూడినవే. రాగము ఉండినంతవరకు వైరాగ్యము మనకు లభించదు. అయితే ఆరాగాన్నికూడను కొంత అదుపులో పెట్టుకోవాలి. మనకు కారుఉంది. ఆక్సిలరేటర్ నొక్కితే స్పీడ్‌గాపోతుంది. కానీ, రోడ్డుయొక్క పరిస్థితిని, curves ను, ups and downs ను మనము లక్ష్యములో పెట్టుకొని ఆ ఏక్సిలరేటర్ ఎంతవరకో అంత use చేయాలి. మనము ఉన్నది జగత్తులో. ఈ జగత్తు అనేక ఒడిదుడుకులు కలిగినది. అనేక దుఃఖములతో కూడినది. దానిని పురస్కరించుకొని మన మనస్సును కొంతవరకు అదుపులో ఉంచుకోటానికి ప్రయత్నించాలి. ఏక్సిలరేటర్ లేక driving జరుగదు. ఉండాలికాని దానిని అదుపులో ఉంచుకొని మనము ప్రయాణం చేయాలి. అదే విధముగనే మైండ్ మనకు ఉండాలి. దానిని తగిన రూపంలో మనము ఉపయోగించుకోటానికి ప్రయత్నించాలి. ఈనాడు మన మనసు యిష్టానుసారంగా ఉపయోగించుకోటంచేతనే అనేక విధములైన దుఃఖములకు, విచారములకు, కష్టములకు గురౌతున్నాము. అక్కడనే మనకు బుద్ధి అత్యవసరము. బుద్ధి మానవునియొక్క శక్తిని అభివృద్ధి పరుస్తుంది. మానవత్వమనగా బుద్ధియొక్క ప్రభావమే. ఆ బుద్ధియొక్క ప్రభావము సమస్త జగత్తును తనలోనే ఆవరింపచేసుకుంటుంది. ఇదే మనసుయొక్క రహస్యము.

**జగత్తంతా మనస్సుయొక్క ప్రభావమే!**

మనము ప్రపంచమంతా చుట్టాము. హైదరాబాద్ అంతా తిరిగాము, మద్రాసంతా తిరిగాము, బొంబాయి అంతా తిరిగాము. అనేక పర్వతములు చూశాము, నదులు చూశాము, యింకా ఎన్నెన్నో చూశాము. ఎన్ని దృశ్యాలు మనము చూశామో, ఎంతమంది వ్యక్తులను మనము చూశామో, ఎన్ని పదార్థములు చూశామో, అవన్నీకూడ అతిసూక్ష్మ స్వరూపమై మనమైండ్‌లో ప్రింటు అయిపోయాయి. ఇంత చిన్న మైండ్ లోపల యింత ప్రపంచముయొక్క

srisathyasaivachanamrutam

దృశ్యాన్ని ఏవిధముగా నీవు యిముడ్చుకున్నావు? ఇంత పెద్ద పర్వతము నీ మనసులో ఉండటానికి ఎక్కడైనా చోటుఉందా? అనగా మనస్సంటే ఎంత విశాలమైనదో మనము గుర్తించవచ్చు. ప్రపంచమంతా మనలోనే యిమిడిఉంది. కనుకనే 'మనో మూల మిదం జగత్', జగత్తంతా మనసుయొక్క ప్రభావమే! ఆ జగత్తులో నేనుకూడ ఒకడను. ఇంత మనోమయమైన యీ జగత్తులో యీ దేహం ఎంతటిది? ఈ విధమైన విశాలతను, అందులోనే కొంత అణుతత్త్వమును మనము చక్కగా విచారించినప్పుడే వైరాగ్యము మనకు లభిస్తుంది. ఇంత విశాలమైన ప్రపంచములో యీ దేహము ఎంతటిది? ఈ అణుమాత్రముగా చూచినప్పుడు మనకు ఎంత అవమానంగా తోస్తుంది! కనుకనే వేదాంతము 'అణోరణీయాన్ మహతోమహీయాన్' అన్నది. మహత్తులో చాలా మహత్తరమైనది, అణువులలో చాలా సూక్ష్మమైనది. ఈ రెండింటిలో ఉన్న తత్త్వము ఒక్కటే! మఱ్ఱిచెట్టు చాలా పెద్దదిగా ఉంటుంది. మద్రాసులో మీరు చూచిఉండవచ్చు. థీసాఫికల్ సొసైటీలో పెద్ద వృక్షము. కాని అందులో ఉన్న విత్తనం చాలా చిన్నది. ఈ చిన్న విత్తనములోనే పెద్ద మహావృక్షము యిమిడి ఉంది. ఈ పెద్దవృక్షములో చిన్నవిత్తనము యిమిడిఉంది. అదేవిధముగనే మన మనస్సు అతి స్వల్పంగా నీవు భావించవచ్చును. అందులోపలనే అనంతత్వము ఉంటుంది. అనంతత్వమైన యీజగత్తులో అల్పత్వమైన చిన్న అణుస్వరూపమైన మనస్తత్వము కూడా యిమిడి ఉంటుంది. 'అది నేనే, నేను అదే'. దేహభ్రాంతి ఉండినంతవరకు ఈ ఆనందము ఈ ఏకత్వము, మనకు అర్థముకాదు. స్థూలమైన దృష్టి ఉండినంతవరకుకూడను యీ అనంతత్వము మనకు అర్థముకాదు. చిన్న ఉదాహరణము.

ఒక పెద్ద సిమెంటు తొట్టెఉంది. లేక ఒక tank లోకి పోయి మనము చూస్తున్నాము. అందులో చూస్తే మన ప్రతిబింబము ఆ జలములో కనుపిస్తుంది. నీవు ఏమంటున్నావు? 'అది నేనే' అంటున్నావు. కాని, విచారణ చేసినప్పుడు నేను కాదు. అది నేనే, నేను అదికాదు. ఇందులో ఉన్న వ్యత్యాసమును గుర్తించాలి. అది నేనే, నీయొక్క దేహమును భ్రమించుకొని అది నేనే అంటున్నావు. అది నేనే అంటున్నప్పుడు ఆప్రతి బింబమును కట్టె తీసుకొని ఎంతమంది కొట్టినా నీకేమి ఏడుపురాదు. దెబ్బతగలదు. ఆ ప్రతిబింబమును ఎవరైనా వచ్చి దూషిస్తే నీకు కోపం వస్తుంది. కొడితే దెబ్బ తగలదు కాని, తిడితే మాత్రం దెబ్బతగులుతుంది. కొట్టినప్పుడు అది నేనుకాదు. తిట్టినప్పుడు నేను అదే! ఇదే వేదాంతములో ఉన్న రహస్యము. అనగా

హృదయమును, ఆత్మతత్త్వాన్ని ఏకత్వముగా గుర్తించుకున్నప్పుడు ఎవరికి ఏబాధ కల్గినా అదినాదే! కాని దేహభ్రాంతితో ఉన్నప్పుడు ఎవరేమనుకున్నా అది నాది కాదు. ఈ విశాలమైన ప్రబోధలు గావించేదే వేదాంతము.

**'జ్ఞాతుం, ద్రష్టుం, ప్రవేష్టుం', ఈ మూడింటి ఏకత్వమువలననే ఆనందము లభిస్తుంది**

ఇట్టి పవిత్రమైన నిత్యమైన, సత్యమైన తత్త్వాన్ని గుర్తించుకోటానికే యీ విధమైన కొన్ని సమావేశములలో పాల్గొనాలి. ఈ సమావేశములో మీరు విన్న విషయములు కన్న విషయములు కొంత హృదయములో భద్రము చేసుకోవాలి. కనుకనే శ్రవణమనగా వినటము. విన్నదానిని తిరిగి స్మరించుకోటం మననం. చింతించిన దానిని ప్రాక్టికల్‌లో పెట్టటం నిధిధ్యాస. పదార్థరూపములో చేసిన వంటను డైనింగ్‌హాలులో తెచ్చిపెట్టుకోటం. కిచెన్‌రూమ్‌లో వంట తయారు చేయటమే ఒకశ్రవణము. శ్రవణము చేసినంతమాత్రమున ప్రయోజనము లేదు. కిచెన్ రూమ్‌లో కావలసినంత వంటలున్నమాత్రమున ప్రయోజనము లేదు. దానిని డైనింగ్ హాల్‌లోకి తెచ్చి ప్లేటులో పెట్టుకోవాలి. అదే మననం. ఆ వంట తినాలి అనేది నిధిధ్యాస. వంట వండటము, పెట్టుకోటము, అనుభవించటము. అదే జ్ఞాతుం, ద్రష్టుం, ప్రవేష్టుం'. అమ్మగారు వచ్చి చెప్పారు, 'నాయనా! నీకోసం పాయసము చేశాను, పులిహోర చేశాను, వడలు చేశాన'ని. అది విన్నావు. ఆ వినటమే 'జ్ఞాతుం'. అవన్నీ తెచ్చి తట్టలో పెట్టుకున్నావు. బాగా చూశావు ఇది 'ద్రష్టుం'. చూడటమే కాకుండా 'ప్రవేష్టుం'. లోపలకు పోవాలి. అప్పుడే మనకు పుష్టి, సంతుష్టి లభిస్తుంది. పెద్దలు చెప్పిన విషయముగాని, పిల్లలు చెప్పిన విషయములుగాని కొంతవరకు మనము విని చక్కగా దానిని మననము చేసి ఒకటి రెండైనా ప్రాక్టికల్‌లో పెట్టటానికి ప్రయత్నించాలి. ఈ మూడింటియొక్క ఏకత్వమే నిజమైన ఆనందమునకు మూలము.

**పదార్థదృష్టిని పెట్టుకోకండి, పరార్థదృష్టిని పెంచుకోండి**

విద్యార్థులారా! వైరాగ్యమనగా మనము అన్నింటిని వదలి ఎక్కడకో పోవటం కాదు. మనము ఉండిన స్థితియందే ఉండి వస్తువుయొక్క తత్త్వాన్ని మరచి దాని యొక్క యథార్థమైన సారమును అనుభవించటమే వైరాగ్యము. పదార్థ దృష్టిని మీరు పెట్టుకోకండి. పరార్థ దృష్టిని పెంచుకోండి. వస్తువుయందున్న విషయ రహస్యమును గుర్తించుకోటమే వైరాగ్యము. చిన్న



srisathyasaivachanamrutam

ఉదాహరణము. మార్కెట్టుకు వెళ్లి ఒక మామిడి పండు తెచ్చుకున్నాము. ఈ మామిడి పండుకు వెల నేనే యిచ్చాను. నా డబ్బులు నేనిచ్చాను. ఎవరిదగ్గర దొంగిలించుకొని రాలేదు. ఎవరి డబ్బో నేను యివ్వలేదు. ఇది నాడబ్బు అని అహంకార పడవచ్చు. మామిడి పండు కొనుక్కొని తెచ్చావు. అది తినే సమయములో నీవు ఏమిచేస్తావు. ఆ జ్యూస్ మాత్రమే నీవు స్వీకరిస్తావు. విత్తనమును, పై బెండును పారవేస్తావు. Mango కొనవద్దనలేదు. మామిడి ఫలమును కొను. అది భుజించు. సారాన్ని స్వీకరించు. నిస్సారమును విసర్జించు, ఇదే వైరాగ్యము. అట్లుకాకుండా నేనే డబ్బు పెట్టి కొనుక్కున్నానని ఆ విత్తనంకూడా తినటానికి ప్రయత్నిస్తే అది యెంత మూర్ఖత్వము అవుతుంది! కనుకనే యీ వైరాగ్యమనేది నిత్యానిత్య విషయ పరిశీలన చేసి ఏది స్వీకరించవలసినది, ఏది విసర్జించవలసినది అనే discrimination power లేకపోతే అది కేవలము ఒక మూర్ఖత్వముగా రూపొందుతుంది. ఆ discrimination power తో ఏది స్వీకరించాలి, ఏది విసర్జించాలి అని నిర్ణయము చేసుకోటమే వైరాగ్యము.

కనుక, వైరాగ్యమంటే తప్పు అర్థముగా మీరు తీసుకోకూడదు. అన్నీ వదలిపెట్టి అరణ్యములకు పోవటమని మీరు భావించరాదు. అన్నింటియందు దైవత్వమును మీరు అనుభవించండి. దైవత్వమును దృష్టిలో ఉంచుకోండి. అదే నిజమైన వైరాగ్యము. అంతేగాని ఏదో మనం ఆలుబిడ్డలను వదలిపెట్టి, ఆస్తిపాస్తులను వదలిపెట్టి సర్వసంగ పరిత్యాగులమై అరణ్యమునకు పోవటం కాదు. అరణ్యము మాత్రం ప్రపంచముకాదా? అక్కడంతా మనుష్యులు లేకపోవటంవలన చెట్లు పెరిగాయి. ఇక్కడ మనుషులు ఉండటంవలన చెట్లు కొట్టేస్తున్నారు. అంతేగానీ, అదికూడా ప్రపంచములో భాగమే! కనుక, మనము చేసే విధానములో మంచి, చెడులు విచారణ చేసి అనుభవించటానికి ప్రయత్నము చేయాలి.

**(తేదీ. 11-07-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasaivachanamrutam